## విదేశాల్లో... షార్ట్ ఫిల్మ్ ఇండస్ట్రీ

పాశ్చాత్య దేశాల్లో షార్ట్ ఫిల్మ్‌ల డీవీడీలకి కూడా గిరాకీ ఎక్కువే. 20 నుండి 30 లఘు చిత్రాల్ని ఒక డివిడి చేసి అమ్ముతారక్కడ. ప్రఖ్యాత జపనీస్ దర్శకుడు అకీరా కురొసావా నెంబర్‌వన్ దర్శకుడిగా ఉన్నప్పుడు కూడా లఘుచిత్రాలు తీశాడు. ఆయన తీసిన లఘు చిత్రాల్ని 'డ్రీమ్' పేరుతో డీవీడీ విడుదల చేస్తే ప్రపంచ ప్రేక్షకులు క్యూలో నిలబడి కొన్నారు. చార్లీచాప్లిన్ కూడా లఘుచిత్రాలకి పెట్టింది పేరు. ముంబయి ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ లాంటి పెద్ద ఫెస్టివళ్లలో విదేశీ షార్ట్ ఫిల్మ్‌లను ప్రత్యేకంగా ప్రదర్శిస్తారు.

### ఆదిలోనే ఆగిపోయాయి...

సాధారణంగా షార్ట్ ఫిల్మ్‌ల నిడివి 5 నుంచి 30 నిమిషాలు ఉంటుంది. అంతకన్నా పెద్ద 'షార్ట్ ఫిల్మ్'లు కూడా ఉన్నాయి. అయితే 20 నిమిషాలకి కాస్త అటు ఇటుగా ఉండే సినిమాలే ఎక్కువ. 20 నుండి 22 నిమిషాల వ్యవధిలో నిర్మించడం వల్ల అదనపు లాభాలు కూడా ఉన్నాయి. ఫెస్టివల్స్‌కి పంపించడంతో పాటు వాటిని టీవీచానళ్లకి కూడా అమ్ముకోవచ్చు. అందుకే ఎక్కువ మంది 22 నిమిషాల వ్యవధి ఉండే షార్ట్ ఫిల్మ్‌లనే నిర్మిస్తున్నారు.

గతంలో 'మా టీవీ', కె. రాఘవేంద్రరావు సంయుక్తంగా 'రేపటి దర్శకులు' పేరుతో ఒక కార్యక్రమం చేపట్టారు. షార్ట్ ఫిల్మ్ మేకర్స్ తీసిన సినిమాలను టీవీలో ప్రసారం చేశారు. అయితే ఆ కార్యక్రమానికి చాలా తక్కువ కాలం లోనే ఫుల్‌స్టాప్ పెట్టారు. తెలుగు చలనచిత్ర దర్శకుల సంఘం సర్వసభ్య సమావేశాల్లో కూడా షార్ట్ ఫిల్మ్‌ల నిర్మాణం గురించి చాలా సార్లు చర్చించారు. ఔత్సాహిక దర్శకులను ప్రోత్సహించాలనే నిర్ణయం కూడా తీసుకున్నారు. కారణమేమిటో తెలియదు కాని ఆ ప్రయత్నం ఆదిలోనే ఆగిపోయింది.

### స్థానికుల కోసమని...

మన దేశంలో షార్ట్ ఫిల్మ్ ఫెస్టివళ్లు ఎక్కువగా ముంబై, గోవాలలో జరుగుతాయి. కాబట్టి ఆ ఫెస్టివల్స్ గురించి ఇదివరకు మన వాళ్లకి అంతగా తెలిసేది కాదు. తెలిసినా ఆసక్తి చూపేవాళ్లు చాలా తక్కువ. కాని ఈ మధ్య మన రాష్ట్రంలో విజయవాడ, తెనాలి, కరీంనగర్‌లలో స్థానిక ఫిల్మ్ సొసైటీలు ఈ ఫెస్టివల్స్‌ని నిర్వహించాయి. ఇప్పుడు హైదరాబాద్‌లో జరగబోతోన్న ఫెస్టివల్‌ని రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాల శాఖ సహకారంతో ఎం.వి.ఎస్. స్టూడియో నిర్వహిస్తున్నది. మాదాపూర్ లోని 'స్టేట్ ఆర్ట్ గ్యాలరీ' దీనికి వేదిక కానుంది. ఫెస్టివల్ కన్వీనర్ శ్రీచైతన్య నటుడే కాకుండా షార్ట్ ఫిల్మ్ మేకర్ కూడా.

''ఇప్పటికి నాలుగు లఘు చిత్రాలు తీశాను. '?' అనే టైటిల్‌తో నేను తీసిన సినిమాకి ఇటలీలో జరిగిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో జ్యూరీ అవార్డు లభించింది. నా నాలుగు చిత్రాలు చాలా జాతీయ, అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో ప్రదర్శించబడ్డాయి. అవార్డులు కూడా వచ్చాయి. ఆ అనుభవంతోనే ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నా''నని చెప్పాడు శ్రీచైతన్య. ఈ పోటీల్లో మొత్తం ఆరు విభాగాల్లో అవార్డులు అందజేస్తారు. అవేవంటే...

ఉత్తమ చిత్రం ఫిక్షన్, ఉత్తమ చిత్రం నాన్ ఫిక్షన్, ఉత్తమ సినిమాటోగ్రఫీ, ఉత్తమ కాన్సెప్ట్, ఉత్తమ యానిమేషన్ చిత్రం, ఉత్తమ దర్శకుడు, బెస్ట్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్.

విదేశాల నుండి కూడా ఫెస్టివల్‌కి కొన్ని ఎంట్రీలు వస్తున్నా ఎక్కువగా మన రాష్ట్రం నుండే వస్తున్నాయి.

టాలీవుడ్ నటుడు, రచయిత తనికెళ్ల భరణి కూడా షార్ట్ ఫిల్మ్‌లు తీశారు. అవార్డులు కూడా గెలుచుకున్నారు. ''రెగ్యులర్ సినిమాల్లో నటిస్తున్నాను కాబట్టే, నాలో ఉన్న తపనను నేను గుర్తించాను కాబట్టే నన్ను నేను తృప్తి పరచుకోవడానికి లఘు చిత్రాలు తీస్తున్నాను. షార్ట్ ఫిల్మ్‌లు తీసే వాళ్లకి నేను చెప్పేదొక్కటే... ఎంత నిడివితో సినిమా తీశామన్నది ముఖ్యం కాదు. జీవితంలోని అసలుసిసలు కోణాలను ఆవిష్కరించడం ముఖ్యం'' అని భరణి అంటారు. ఆయన తీసిన సినిమాలు సిరా, కీ, బ్లూక్రాస్, ద లాస్ట్ ఫార్మర్.

### షార్ట్ ఫిల్మ్‌కీ 'నంది' ఇవ్వాలి

''ప్రజలను చైతన్యవంతుల్ని చెయ్యడంలో షార్ట్ ఫిల్మ్ ఒక మాధ్యమంగా ఉండాలన్నదే మా ఉద్దేశం. సృజనాత్మకతని, కొత్త ఆలోచనలని ప్రోత్సహించడానికే ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్నాం. లఘు చిత్రాల్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన కూడా ఉంది. సినిమాలకి ఇచ్చే నంది అవార్డుల్లో షార్ట్ ఫిల్మ్‌లను కూడా చేర్చాలి'' అన్నారు దివాకర్‌బాబు. నంది నాటక అవార్డులు, నంది టివి అవార్డులు అని చాలా రకాల అవార్డులు రాష్ట్రప్రభుత్వం ప్రకటిస్తుంది. అయితే షార్ట్ ఫిల్మ్‌లకు మాత్రం ఎలాంటి గుర్తింపు ఇవ్వడం లేదు. షార్ట్ ఫిల్మ్‌లు తీయడం వ్యాపారం కాదు కాబట్టి, కేవలం ఆ కళ అంటే ఇష్టపడే వాళ్లు తీస్తున్నవి కాబట్టి అలాంటి వారిని కూడా గుర్తించాలి.



'యువర్స్ మీ' సినిమా తీస్తున్న దర్శకుడు కమల్

అవార్డుల మాట పక్కనుంచితే లఘుచిత్రాల్ని ప్రోత్సహించడానికి తగిన మార్కెట్ అవసరం. ఆ మార్కెట్ ఇప్పుడిప్పుడే మనదేశంలో పెరుగుతోంది. ఎలాగంటే... సినిమాలను ఆన్‌లైన్‌లో అందించే వెబ్‌సైట్లు ఇప్పుడు షార్ట్ ఫిల్మ్‌లను కొంటున్నాయి. ఆ వెబ్‌సైట్లు నడిపేవాళ్లు ఫిల్మ్ ఫెస్టివళ్లకు వెళ్లి వారికి నచ్చిన సినిమాలను కొంటున్నారు. ఇది మరింత పెరిగితే చిన్న సినిమాకి మంచిరోజులొచ్చినట్టే.